క్లుప్తంగా

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మనోజ్ మాట్లాడుతూ మండలం ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్న ఆధార్ సెంటర్ లేక మండల ప్రజలు ఎల్లారెడ్డిపేట, గొల్లపల్లి, సిరిసిల్లకు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆధార్ సెంటర్‌ను త్వరగా ఏర్పాటు చేసి మండల ప్రజల సమస్యను తీర్చాలని అధికారులను కోరారు. అదేవిధంగా వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు పరిహారం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో క్రాంతి, దిలీప్, కార్తిక్, వినయ్, విష్ణు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: హైదరాబాద్‌లో మే 7న జరిగే బీఎస్పీ బహిరంగ సభ పోస్టర్‌ను మండలంలోని బండలింగంపల్లిలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు నీరటి బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కుంట శ్రీను, సంజీవ్, రవి, రాజం, అజయ్, భార్గవ్ పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన అధికారులు



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలో వడగళ్ల వానంతో నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. సోమవారం వేములవాడ మండలంలోని వట్టెంల, నూకలమర్రి, నమిలిగుండుపల్లి, ఎదురుగట్ల, ఫాజుల్‌నగర్, మర్రిపల్లి గ్రామాల్లో ఏవో సాయి కిరణ్, ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అనూష, సందీప్ పాల్గొన్నారు.

కలగా కల్లాలు

- 197 కల్లాలకు కేవలం 47 పూర్తి
- రూ.కోటి 60 లక్షల నిధులు మంజూరు
- పథకంపై అవగాహన కల్పించని అధికారులు
- ఆరబెట్టేందుకు అన్నదాతల అవస్థలు



ఎల్లారెడ్డిపేటలో నిర్మించుకున్న కల్లం

ఎల్లారెడ్డిపేట: ప్రస్తుతం రైతులకు పెద్ద సమస్య వచ్చి మీద పడింది. పండించిన ధాన్యం ఆరబెట్టేందుకు సరైన స్థలం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. తాము పండించిన ధాన్యాన్ని పొలం వద్దనే ఆరబెట్టుకోవడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కల్లాల నిర్మాణాలు కార్యరూపం దాల్చలేదు. ఈ విషయంలో రైతుల్లో అవగాహన కోసం అధికారులు ఎలాంటి సదస్సులు నిర్వహించకపోవడంతో రైతులు కల్లాల నిర్మాణంపై ఆసక్తి చూపడం లేదు.

ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామాల్లో 197 కల్లాల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.కోటి 60 లక్షల 46 వేలు మంజూరు చేసింది. రెండేళ్ల క్రితం నిధులు కేటాయించి ఏడాదిలోగా 197 కల్లాలను పూర్తి చేయాలని సూచించగా, ఇప్పటి వరకు కేవలం 47 కల్లాలు మాత్రమే పూర్తి చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. కల్లాల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. కల్లాలు లేక రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి వేరే ప్రాంతాలకు తరలించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

116 కల్లాలకు మార్కింగ్

మండలానికి ప్రభుత్వం 197 కల్లాలను మొదటి విడతలో మంజూరు చేయగా అధికారులు గ్రామాల్లో రైతులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి 116 కల్లాల ఏర్పాటుకు అధికారులు మార్కింగ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కల్లాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా వ్యవసాయశాఖ అధికారులు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ఈ మూడు శాఖల అధికారులు కల్లాల ఏర్పాటుపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 197కు కేవలం 47 మాత్రమే రెండేళ్ల కాలంలో పూర్తిచేయగలిగారు. రైతులకు కల్లాల ఏర్పాటుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే ఎప్పుడో లక్ష్యం చేరుకునేవారు.

మూడు పద్ధతుల్లో కల్లాల ఏర్పాటు

కల్లాల ఏర్పాటు మూడు పద్ధతుల్లో పొలం విస్తీర్ణం, ఎకరాల చొప్పున నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. 50 చదరపు మీటర్లకు రూ.56,100, 60 చదరపు మీటర్లకు రూ.68 వేలు, 75 చదరపు మీటర్లకు రూ.85 వేల చొప్పున ఉపాధి హామీలో నిధులు కేటాయించింది. ఈ పరిమితుల్లో అన్నదాతలకు అవగాహన కల్పించి కల్లాలను అందుబాటులోకి తేవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడంపై విమర్శలు వస్తున్నాయి. కల్లాలు అందుబాటులో లేక రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి అరిగోస పడుతున్నారు. మూడు శాఖల అధికారులు సమన్వయంతో రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వ లక్ష్యం ప్రకారం కల్లాల సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.



రైతు ఏర్పాటు చేసుకున్న కల్లం

అవగాహన కల్పించడం లేదు



ప్రభుత్వం సూచించిన విధంగా రైతులకు కల్లాల ఏర్పాటుపై అధికారులు అవగాహన కల్పించడం లేదు. కల్లాల గురించి తెలియకపోవడంతో రైతులు వాటిని నిర్మించుకునేందుకు ముందుకు రావడం లేదు. పండించిన ధాన్యాన్ని కల్లాలు లేక ఆరబెట్టుకోవడం ఇబ్బందిగా మారింది.

– బందారపు బాల్‌రెడ్డి, రైతు, ఎల్లారెడ్డిపేట

త్వరలో పూర్తి చేస్తాం



ప్రభుత్వం మండలానికి 197 కల్లాలను మంజూరు చేసింది. మంజూరు చేసిన వెంటనే 116 కల్లాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించి మార్కింగ్ చేశాం. రైతులు కల్లాల ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదు. ఎంపిక చేసిన రైతులు కాకుండా కొత్త వారిని ఎంపిక చేసి కల్లాల ఏర్పాటును పూర్తి చేస్తాం.

– కొమురయ్య, ఏపీవో, ఎల్లారెడ్డిపేట

సమాచారం

6న మండల సర్వసభ్య సమావేశం

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6న ఎంపీపీ పిల్లి రేణుక అధ్యక్షతన ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నియామకం

కుర్మ సంఘం కార్యవర్గం

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ కుర్మ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. పెద్ద కుర్మగా గజ్జె మహంకాళి, అధ్యక్షుడిగా దయ్యాల రాజమల్లు, ఉపాధ్యక్షుడిగా కంబాల ఐలయ్య, ప్రధానకార్యదర్శిగా కంబాల కొమురయ్య, కోశాధికారిగా గుంటి ఐలయ్య, సంయుక్త కార్యదర్శిగా భూమల్ల మహంకాళి, సలహాదారులుగా గజ్జె బీరయ్య, దయ్యాల మల్లయ్య, దయ్యాల లచ్చయ్య, మొట్టె మల్లయ్య ఎన్నికయ్యారు.

మసీదు కమిటీ

బోయినపల్లి మండలంలోని తడగొండ గ్రామ నూర్‌భాషా సంఘం మసీదు కమిటీ అధ్యక్షుడిగా ఎండీ గఫూర్, ఉపాధ్యక్షుడిగా లతీఫ్, కార్యదర్శిగా హకీం, కోశాధికారిగా హైమద్ ఎన్నికయ్యారు.

రెడ్డి సంఘం మండల కార్యాలయ భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి

తంగళ్లపల్లి: మండల రెడ్డి సంఘం కార్యాలయాన్ని సోమవారం జిల్లా అధ్యక్షుడు కూర అంజిరెడ్డి, మండల అధ్యక్షుడు ఎసిరెడ్డి రాంరెడ్డి ప్రారంభించారు. అనంతరం రెడ్డి సంఘం మండల కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కలెపెల్లి తిరుపతి రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు ఆసాని లావణ్య, కోశాధికారి ఇట్టి రెడ్డి శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి వాలీబాల్ శిబిరం..



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మీనయ్య

రుద్రంగి: స్థానిక తెలంగాణ క్రీడా ప్రాంగణంలో సమ్మర్ వాలీబాల్ శిబిరాన్ని జెడ్పీటీసీ గట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గంగారాం, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు సుంచు అనిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మించిన రేకుల షెడ్డు కూల్చివేత



రేకుల షెడ్డును కూల్చి వేయిస్తున్న ఆర్ఐ

చందుర్తి: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును ఆర్ఐ రవి పోలీసుల సహకారంతో కూల్చివేయించారు. మండలంలోని నర్సింగపూర్ గ్రామ శివారులోని (పెద్దమ్మ గుట్ట) వద్ద గల 272 సర్వే నెంబర్‌లో ఎలాంటి అనుమతి లేకుండా ఒక వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించుకున్నాడు. ఈ సందర్భంగా తహసీల్దార్ మజీద్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన, అక్రమంగా సాగు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో అక్రమణ, అక్రమ నిర్మాణాలు చేపట్టితే తమకు సమాచారాన్ని ఇవ్వాలని కోరారు.

మే డే వేడుకలు



జెండా ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్



సిరిసిల్లలో సీపీఎం ఆధ్వర్యంలో మే డే ర్యాలీ



వీర్నపల్లిలో మాట్లాడుతున్న టి.స్కైలాబ్‌బాబు



ఎల్లారెడ్డిపేటలో ..



నాగలితో విన్యాసం చేస్తున్న కొత్తుల రాజు

జిల్లాలో మే డే ఉత్సవాలను సోమవారం అన్ని పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిరిసిల్లలో సీపీఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, ఆటపాటలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వీర్నపల్లిలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్ బాబు, రుద్రంగిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాదారి రాములు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. వివిధ మండలాల్లో నిర్వహించిన వేడుకల్లో సీఐటీయూ జిల్లా నాయకులు మల్యాల నర్సయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, కోడం రమణ, సీపీఐ నాయకులు కదారి రాములు, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

– సిరిసిల్లటౌన్/వేములవాడ/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/రుద్రంగి/వేములవాడరూరల్/గంభీరావుపేట/చందుర్తి బోయినపల్లి/ఇల్లంతకుంట/కోనరావుపేట/ముస్తాబాద్

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కోనరావుపేట: మండలంలోని నాగారం శ్రీకోదండ రామస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. నాగారంలో జరుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. విగ్రహప్రతిష్ఠాపన, సీతారాముల కల్యాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 3న ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఆలయంలో దేవాదాయ శాఖ నుంచి రూ.80 లక్షలు మంజూరు కాగా పనులు చివరి దశకు చేరుకున్నాయని, మరో రూ.80 లక్షల వ్యయంతో భారీ ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిపారు. నాగారం ఆలయాన్ని మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, సర్పంచ్ లావణ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో శ్రీగంగమ్మ దేవత ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలను సోమవారం ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాకు భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, పంచగవ్య ప్రాశన, రుత్విగ్వరణం, యాగశాల ప్రవేశం గావించారు. అఖండ దీప స్థాపన, అంకురరోహణం, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ పూజలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్ఠ, దేవత హోమాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తన్నీరు బాపురావు, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, ఎంపీటీసీ బాలకిషన్, ఉపసర్పంచ్ మంజుల, గంగాభవాని ఆలయ కమిటీ బాధ్యులు మల్లయ్య, శ్రీనివాస్, జగన్, పాక శంకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

పోచమ్మకు బోనాలు



కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో సోమవారం పోచమ్మ బోనాలు తీశారు. గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకాదేవి-జమదగ్ని కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటాం



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. రైతులు కటకం శంకరయ్య,సందుపట్ల బాపురెడ్డి, బాధ తిరుపతి, బాలయ్య, పద్మారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

తంగళ్లపల్లి: తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. సోమవారం మండలంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎంపీపీ పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని అధైర్య పడవద్దని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ రమణారెడ్డి, ఎంపీటీసీ కోడి అంతయ్య, ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులకు భూమిపూజ

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంట, వెంకట్రావుపల్లె గ్రామాల మధ్య వంతెన నిర్మాణ పనులకు ఎంపీపీ జనగామ శరత్‌రావు సోమవారం భూమిపూజ నిర్వహించారు. మంత్రి కేటీఆర్ సహకారంతో మారుమూల గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ కల్వకుంట్ల వనజ, డీఈ సుదర్శన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, శ్రీనివాస్‌రావు, సతీశ్, వేణు, రాజేశం పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు

తంగళ్లపల్లి: గ్రామపంచాయతీ కార్యదర్శులపై కక్ష్య సాధింపు చర్యలు మానుకొని వెంటనే వారిని రెగ్యులరైజ్ చేయాలని సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే.మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిరవధిన సమ్మెలో ఉన్న జేపీఎస్, ఓపీఎస్‌లకు కాంగ్రెస్ తరుపున సంఘీబావం ప్రకటించి మాట్లాడారు. పల్లెల అభివృద్ధిలో జేపీఎస్‌లు కీలకపాత్ర పోషించారన్నారు. వారివి న్యాయమైన డిమాండ్లని అన్నారు. ప్రొబేషనరీ పూర్తయిన వారిని రెగ్యులర్ చేయకపోవడం చట్టవిరుద్ధమన్నారు. ప్రభుత్వ మెడలు వంచైనా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం మండలానికి చెందిన పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శాంతియుత నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల జేపీఎస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కదిరె శివప్రసాద్, శేఖర్, మారుతి, అనీల్, మల్లేశం, భాగ్యలక్ష్మి, అంజలి, శ్రీహిత, శ్రీదేవి పాల్గొన్నారు.



మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన నాయకులు

వేములవాడరూరల్/చందుర్తి: వడగళ్ల వానతో కురిసిన పంట పొలాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎర్రం మహేశ్, సెస్ మాజీ అధ్యక్షుడు అల్లాడి రమేశ్ సోమవారం పరిశీలించారు. వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి, చందుర్తి మండలంలోని మల్యాల, రామన్న, ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్, నర్సింగపూర్, చందుర్తి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న వరి పొలాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వారు వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగళ్ల వానతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షులు శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ఆందోళన

ముస్తాబాద్: అకాల వర్షాలు, వడగండ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు ముస్తాబాద్‌లో ఆందోళన చేపట్టారు. ముస్తాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పక్షం రోజులైనా ఒక బస్తా ధాన్యాన్ని కూడా తూకం వేయలేదన్నారు. అకాల వర్షాలతో రైతులు ధాన్యాన్ని ఆరబోయడం, కవర్లతో కప్పుతూ ఇబ్బంది పడుతున్నారన్నారు. కేంద్రాలలో సరైన వసతులు లేవన్నారు. టార్పాలిన్లు, కవర్లు అందజేయలేదని, దీంతో ధాన్యం రంగుమారి, మొలకలు వచ్చాయన్నారు. ఎకరానికి రూ.25వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగిల్‌విండో వైస్‌చైర్మన్ నిమ్మల రవి, రాజేందర్‌రెడ్డి, వెల్మల రాంరెడ్డి, దీటి నర్సింలు, సత్యం, రమేశ్, ప్రశాంత్, మహేశ్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

వీర్నపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షంతో నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కేకే మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం వీర్నపల్లి మండలంలోని రంగంపేట, గర్జనపల్లి ,వన్‌పల్లి, కేలోత్ తండా,వన్‌పల్లి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు.